

పంచాయతీరాజ్ సదస్సును జయప్రదం చేయండి

అనంతపురం అర్బన్, డిసెంబరు 31: గుంటూరు జిల్లా మంగళగిరిలో జనవరి 3వ తేదీన నిర్వహించే పంచాయతీరాజ్ సదస్సును జయప్రదం చేయాలని పంచాయతీరాజ్ చాంబర్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డేగల కృష్ణమూర్తి, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రంగయ్య ఆదివారం ప్రకటనలో కోరారు. ఏపీ సర్పంచ్‌ల సంఘం, ఏపీ పంచాయతీరాజ్ చాంబర్ ఆధ్వర్యంలో నిర్వహించే సదస్సుకు మాజీ సీఎం చంద్రబాబునాయుడు ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. సదస్సుకు ఉమ్మడి జిల్లాల నుంచి పెద్దఎత్తున సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కౌన్సిలర్లు, కార్పొరేటర్లు హాజరుకావాలని వారు కోరారు.




విద్యుద్దీపాల వెలుగులో క్లాక్‌టవర్


అనంతపురంలోని పాతవూరులో రద్దీ

నూతనోత్సాహం

నూతన సంవత్సర షాపింగ్‌లతో బిజీబిజీగా జనం.. కిటకిటలాడిన బేకరీలు, పూల దుకాణాలు


కేకులు కొనేందుకు ఎగబడుతున్న జనం


పూలబొకేల కొనుగోళ్లలో జనం


దుస్తుల కొనుగోళ్లు


అలంకరణలో కలెక్టరేట్...

అనంతపురం కల్చరల్, డిసెంబరు 31: కాలచక్రంలో మరో ఏడాది కరిగిపోయింది. చేదు, తీపి జ్ఞాపకాలు కలబోసుకుంటూ కాలగమనంలో కలిసిపోయింది. ఆశలు, ఆకాంక్షలతో మరో నూతన సంవత్సరం 2024 ప్రవేశించింది. ఆదివారం అర్ధరాత్రి 12 గంటలు దాటగానే నూతన సంవత్సరాన్ని జిల్లావ్యాప్తంగా ప్రజలు కేరింతలతో స్వాగతించారు. కేక్‌లు కట్ చేయడంతో పాటు పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకుంటూ ఆనందోత్సాహాలతో గడిపారు. పాత ఏడాదికి వీడ్కోలు పలుకుతూ... కొత్త ఏడాదిని స్వాగతిస్తూ ఆనందోత్సాహాల నడుమ జరుపుకునే ఆంగ్ల నూతన సంవత్సరాది వేడుక కావడంతో ప్రజలు నూతన వస్త్రాలు, కేక్‌లు, పూలు, ఫ్లవర్ బొకేలు, పండ్ల కొనుగోళ్లతో బిజీబిజీగా సాగారు. ఆదివారం సాయంత్రం అనంత నగరంలో రోడ్లకిరువైపులా ఉన్న వస్త్ర, పూలు, పండ్ల దుకాణాలు, బేకరీలు కిటకిటలాడాయి. దుకాణదారులు న్యూ ఇయర్ ఆఫర్లను ప్రకటించి, కొనుగోలుదారులను ఆకట్టుకునే ప్రయత్నం చేశారు. మిఠాయి దుకాణాల నిర్వాహకులు సైతం కొనుగోలుదారుల అభిరుచికి అనగుణంగా రకరకాల కేక్‌లను తీర్చిదిద్దారు. కేక్‌లపై కూల్‌డ్రింక్, జ్యూస్ బాటిళ్లు, మిక్చర్ ప్యాకెట్లు ఇలా ఆఫర్లు ప్రకటించారు. పండ్ల వ్యాపారులు, బిరియానీ సెంటర్ల నిర్వాహకులు సైతం ప్రత్యేక ఆఫర్లు ప్రకటించారు. అర్ధరాత్రి 12 గంటలు దాటాక కేక్ కట్‌చేసి నూతన సంవత్సరానికి స్వాగతం పలకడం ఆనవాయితీగా వస్తోంది. ఆ మేరకు ప్రజలు తమ అభీష్టాలకు అనుగుణంగా కేక్‌లను కొనుగోలు చేశారు. రోడ్డుకిరువైపులా బేకరీల నిర్వాహకులు స్టాల్స్ ఏర్పాటువేసి ఆఫర్లు ప్రకటిస్తుండడంతో ప్రజలు కేకుల కొనుగోళ్లకు పోటీ పడ్డారు. నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని జిల్లాకేంద్రంలోని క్లాక్‌టవర్, నగరపాలక సంస్థ కార్యాలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించారు.

కలెక్టర్ నూతన సంవత్సర శుభాకాంక్షలు

అనంతపురం టౌన్, డిసెంబరు 31: అనంతజిల్లా ప్రజలకు కలెక్టర్ గౌతమి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ప్రకటన విడుదల చేశారు. పాత సంవత్సరంలో ఎదురైన చేదు జ్ఞాపకాలను చెరిపేసి, కొత్త సంవత్సరం 2024లో సుఖసంతోషాలతో ఉండాలని కలెక్టరు ఆకాంక్షించారు. సామరస్యం, స్నేహభావంతో మెలగాలని సూచించారు. సోమవారం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు కలెక్టరేట్‌లోని రెవెన్యూభవన్‌లో కలెక్టర్ గౌతమి అందుబాటులో ఉంటారని కలెక్టరేట్ వర్గాలు తెలిపాయి.



టీడీపీ నేతల శుభాకాంక్షలు

అనంతపురం అర్బన్: జిల్లా ప్రజలు, టీడీపీ నాయకులు, కార్యకర్తలకు పలువురు ఆ పార్టీ ముఖ్య నేతలు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మంత్రి పరిటాల సునీత, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు, మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి ఆదివారం వేర్వేరు ప్రకటనలు విడుదల చేశారు. కొత్త సంవత్సరంలో అందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు.

తైక్వాండో అసోసియేషన్ కార్యవర్గం ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 31: జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. సంఘం జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం స్థానిక తపోవనంలోని ఓ హాల్‌లో నిర్వహించారు. అధ్యక్షుడిగా గోపాల్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా గురుస్వామి, కార్యనిర్వాహక కార్యదర్శిగా శాంతరాజ్, కోశాధికారిగా సాయితేజ, ఉపాధ్యక్షులుగా బావాజీ, విజయ్‌కుమార్, మునీంద్ర, సంయుక్తకార్యదర్శులుగా కేశవయ్య, వెంకటేశులు, కార్యవర్గసభ్యులను ఎంపిక చేశారు.

తాగునీటి కోసం రాస్తారోకో


రోడ్డుపై ఆందోళన చేస్తున్న మహిళలు

రాయదుర్గం, డిసెంబరు 31: పట్టణం లోని కోతిగుట్ట ప్రాంతంలో పదిరోజులుగా తాగునీటి సరఫరా లేకపోవడంతో ఆ ప్రాంతవాసులు ఆదివారం సాయంత్రం రోడ్డుపైకి వచ్చి రాస్తారోకో చేశారు. అనంతపురం వెళ్లే ప్రధాన రహదారిపై ఖాళీ బిందెలతో అడ్డుగా నిలిచి వాహన రాకపోకల ను అడ్డుకున్నారు. పదిరోజులుగా తాగునీరు సరఫరా కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆగ్రహం వ్యక్తం చేశారు. నీటి సరఫరా చేసేదాకా ఇక్కడ నుంచి కదల మని భీష్మించారు. గంటపాటు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. వాహనరాకపోకలు నిలిచి పోయాయి. కనీసం ట్యాంకర్ల ద్వారానైనా సరఫరా చేయాలని కోరారు. ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టకపోగా ట్యాంకర్లను కూడా ఏర్పాటు చేయకుండా అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని మండిపడ్డారు. నీటిని సరఫరా చేసేవరకు ఆందోళన విరమించమని హెచ్చరించారు. చివరకు పోలీసులు వచ్చి సర్దిచెప్పి ఆందోళన విరమింపజేశారు.

టీడీపీని గెలిపించేందుకు సిద్ధమైన ప్రజలు: కాలవ


భవిష్యత్తుకు గ్యారెంటీ పోస్టరు ఆవిష్కరిస్తున్న కాలవ

డీ.హీరేహాళ్, డిసెంబరు 31: నాలుగున్నరేళ్లుగా వైసీపీ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలకు విసిగిపోయిన ప్రజలు టీడీపీని గెలిపించేందుకు సిద్ధమయ్యారని మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు తెలియజేశారు. మండలంలోని మడేనహళ్లి గ్రామ పంచాయతీలో బాబు ష్యూరిటీ భవి ష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. నియోజక వర్గంలో మన ఇంటికి మన శీనన్న అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టి మొట్టమొదటిగా ఈ కార్యక్రమాన్ని ఈ మండలంలోనే ప్రారంభించారు. కార్యక్రమంలో పాల్గొన్న కాలవ శ్రీని వాసులు ఇంటింటికి వెళ్లి వైసీపీ ప్రభుత్వ వైఫల్యాలు, టీడీపీ అధికారంలోకి వస్తే చేపట్టే కార్యక్రమాలను వివరించారు. కార్యక్రమంలో హనుమంతరెడ్డి, నాగళ్లి రాజు, మోహన్‌రెడ్డి, గంగాధర, మల్లికా ర్జున, మాజీ సర్పంచ్ హనుమంతు, రామాంజినేయులు, తిప్పేస్వామి, వెంకటేష్, తాయప్ప, బసవరాజు, బసప్ప, వన్నూరుస్వామి పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

మండలంలోని లింగమనహళ్లి గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు పలువురు మాజీమంత్రి కాలవ శ్రీనివాసులు సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి కాలవ కడువా వేసి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో చిదానంద, శివరుద్రప్ప, ఎల్లప్ప, మల్లప్ప, మల్లన్న, కరి నాగప్ప, ఉలగప్ప, గౌసిద్ధ, మల్లన్న, తిరుమలప్ప, తిమ్మప్ప, మల్లికార్జున తదితరులున్నారు.

జీడిపల్లిలో నీటి నిల్వ 0.849 టీఎంసీలు

బెళుగుప్ప, డిసెంబరు 31: మండలంలోని జీడిపల్లి రిజర్వాయరులో ప్రస్తుతం 0.849 టీఎంసీల నీరు నిల్వ వున్నట్లు హంద్రీనీవా అధికారులు ఆదివారం తెలిపారు. రిజర్వాయరుకు ఇన్‌ఫ్లో 358 క్యూసెక్కులుండగా 450 క్యూసెక్కులు ఔట్‌ఫ్లో ఉందన్నారు.

వెల్‌కమ్.. 2024
అట్టహాసంగా నూతన సంవత్సర వేడుకలు



అనంతపురం కల్చరల్, డిసెంబరు 31: ఆంగ్ల నూతన సంవత్సర వేడుకలు అంబరాన్నంటాయి. చిన్నాపెద్ద తేడాలేకుండా అందరూ సంబరాలు చేసుకున్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ఆదివారం రాత్రి హంగామా సృష్టించారు. కేక్‌లు కట్ చేసి, ఆనందం పంచుకున్నారు. పెద్దఎత్తున బాణసంచా కాల్చారు. యువకులు పెద్దఎత్తున రోడ్లపైకి వచ్చి హంగామా చేశారు. పట్టణాలు, నగరాల్లో నడిరోడ్లపై కేక్‌లు కట్ చేశారు. పరస్పరం నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఏ రోడ్డులో చూసినా సందడి కనిపించింది. పల్లెల్లో సైతం నూతన సంవత్సర సందడి కనిపించింది. అందరూ 2024 నూతన సంవత్సరానికి ఘన స్వాగతం పలికారు.


అనంతపురంలోని క్లాక్‌టవర్ వద్ద నూతన సంవత్సర వేడుకల దృశ్యమాలిక..



కేక్ తినిపించుకుంటూ..



ఎలుగుబంట్ల హల్‌చల్..



నీలకంఠాపురం సమీపాన రోడ్డుపైకి వస్తున్న ఎలుగుబంట్లు

మడకశిర రూరల్ డిసెంబరు 31: మండలంలోని నీలకంఠాపురం సమీపంలో ఆదివారం తెల్లవారుజామున ఎలుగుబంట్లు హల్‌చల్ చేశాయి. దీంతో సమీప గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. రెండు రోజులుగా ఎలుగుబంట్లు గ్రామాల వైపు వస్తున్నాయని గ్రామస్థులు తెలిపారు. అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకొని గ్రామాల వైపు ఎలుగుబంట్లు రాకుండా చూడాలని వారు కోరారు.

మున్సిపల్ కార్మికుల అర్ధనగ్న నిరసన



అనంతపురంలో మోకాళ్లపై నిలబడి కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

అనంతపురం క్రైం, డిసెంబరు 31: మున్సిపల్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఆ యూనియన్ నాయకులు అర్ధనగ్న ప్రదర్శన ద్వారా నిరసన తెలిపారు. కార్మికులు చేపట్టిన సమ్మె ఆదివారం ఆరోరోజుకు చేరుకుంది. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్, మున్సిపల్ వర్కర్ల యూనియన్ నాయకులు నాగభూషణం, ఏటీఎం నాగరాజు ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయం ఎదుట అర్ధనగ్న ప్రదర్శనతో మోకాళ్లపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు. తొలుత నగరంలో కార్మికులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో రామిరెడ్డి, వెంకటనారాయణ, నల్లప్ప, శివప్రసాద్, ఎర్రిస్వామి, సాకే తిరుమలేష్ పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయ చర్యలు

కార్మికులు నిరసనకు దిగడంతో మున్సిపల్ అధికారులు... ప్రత్యామ్నాయ చర్యలకు దిగారు. ఇందుకు రూ.లక్షలు ఖర్చు చేయడానికి వెనకాడటం లేదట. ఒక్కో ట్రాక్టర్‌కు రూ.50వేలు, ఎక్స్‌కవేటర్‌కు రూ.50వేలు చొప్పున 8 ట్రాక్టర్లు, 8 ఎక్స్‌కవేటర్ల యజమానులతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు సమాచారం. వాటితో చెత్తను తరలించే ప్రయత్నం చేస్తున్నారు. దీనిపై మున్సిపల్ వర్కర్ల యూనియన్ నాయకులు మండిపడుతున్నారు. విషయం మేయర్ చాంబర్‌లో మేయర్, కమిషనర్, డిప్యూటీ మేయర్లతో యూనియన్ నాయకులు చర్చలు జరిపారు. కొవిడ్, మలేరియా, గార్బేజ్ కార్మికులకు రూ.15వేల జీతం అడిగితే ఇవ్వని వారు ఇప్పుడు ఆ వాహనాలకు రూ.లక్షలు ఎలా ఇస్తారని ప్రశ్నించారు.

ఏపీఎల్ విజేతలు నార్పల, రాప్తాడు జట్లు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 31: ఏపీఎల్‌లో నార్పల, రాప్తాడు జట్లు విజయం సాధించాయి. జిల్లా క్రికెట్ సంఘం, ఆర్డీటీ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక అనంత క్రీడాగ్రామంలో ఏపీఎల్ అండర్-16 బాల, బాలికల క్రికెట్ ఫైనల్స్ నిర్వహించారు. బాలుర మ్యాచ్‌లో రాప్తాడు (ఏఎస్‌వి) జట్టుపై నార్పల 31 పరుగుల తేడాతో గెలుపొంది ఏపీఎల్ విజేతగా నిలిచింది. బాలికల పోటీల్లో అనంతపురం ఎస్ఎస్‌బీఎన్ జట్టుపై రాప్తాడు (ఏఎస్‌వి) జట్టు 8 వికెట్ల తేడాతో విజయం సాధించి ట్రోఫీ కైవసం చేసుకుంది. క్రికెట్ సంఘం జిల్లా కార్యదర్శి మధు ఆచారి విజేతజట్లతోపాటు ఉత్తమ క్రీడాకారులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఏఎస్‌ఏ మేనేజర్ శ్రీదేవి, కోఆర్డినేటర్ వంశీకృష్ణ, కోచ్‌లు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



నార్పల జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న అతిథులు



బాలికల విజేత రాప్తాడు జట్టుకు ట్రోఫీ అందజేస్తూ...

అలరించిన అంతర్ధ్వని నాటిక



నాటికలోని ఓ దృశ్యం



నృత్యం చేస్తున్న చిన్నారులు

పుట్టపర్తి, డిసెంబరు 31: సత్యసాయి భక్తులు అంతర్ధ్వని నాటిక ద్వారా అలరింపజేశారు. ఆదివారం సాయంత్రం స్థానిక సాయికుల్వంత్ మందిరంలో అంతర్ధ్వని పేరుతో డ్యాన్సులు, పాటలతో అలరించారు. మొదట చిన్నారులు నృత్యాన్ని ప్రదర్శించారు. అనంతరం భక్తులు భగవద్గీతలోని కొన్ని ఘట్టాలను ప్రదర్శించారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

ఇసుక అక్రమ తరలింపునకు పోలీసుల సహకారం

ఎమ్మెల్యేకు తొత్తులుగా మారారు
ఫోర్జరీ సంతకాలతో ఇసుక తరలింపు
మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి



ఎస్‌ఐతో వాగ్వాదం చేస్తున్న జేసీపీఆర్

తాడిపత్రి, డిసెంబరు31: వైసీపీ ఎమ్మెల్యే పెద్దారెడ్డికి డీఎస్పీ గంగయ్యతోపాటు పోలీసులు తొత్తులుగా మారి ఇసుక అక్రమ తరలింపునకు సహకరిస్తున్నారని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. తాడిపత్రి మండలం వీరాపురం వద్ద ఉన్న పెన్నానదిలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న టిప్పర్లను ఆదివారం గ్రామస్థులతో కలిసి జేసీ అడ్డుకున్నారు. వాటి వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రోజూ పెన్నానది నుంచి పెద్దఎత్తున ఇసుక తరలిస్తున్నారన్నారు. ఎక్స్‌కవేటర్ సాయంతో టిప్పర్ల ఇసుకను తరలిస్తున్నారన్నారు. అధికారుల ఫోర్జరీ సంతకాలతో అనుమతుల పేరుతో ఇసుక వాహనాలను తరలిస్తున్నారన్నారు. అనుమతి పత్రాల్లో వీరాపురం వీఆర్వో సంతకాలు ఉన్నాయన్నారు. ఇసుక అక్రమ తరలింపునకు వీఆర్వో అనుమతి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. అనుమతి పత్రాలపై సంబంధిత వీఆర్వోకు ఫోన్ చేయగా తాను సంతకాలు చేయలేదని చెప్పాడన్నారు. కేవలం వైసీపీ నాయకులు ఫోర్జరీ సంతకాలతో ఇసుకను తరలిస్తున్నారని ఆయన ఆరోపించారు.

ఎస్‌ఐతో వాగ్వాదం

ఇసుక టిప్పర్లను జేసీ ప్రభాకర్‌రెడ్డి అడ్డుకున్నాడని విషయం తెలుసుకున్న రూరల్ ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ హుటాహుటిన ఘటనా స్థలానికి వచ్చారు. ఆ సమయంలో ఎస్‌ఐతో జేసీ వాగ్వాదానికి దిగారు. ఇసుకను అక్రమంగా తరలిస్తున్న టిప్పర్లను అడ్డుకుంటుంటే ఎందుకొచ్చారని ప్రశ్నించారు. అనుమతి పత్రాల్లో ఫోర్జరీ సంతకాలు ఉన్నాయని ఎస్‌ఐకి తెలిపారు. అనుమతి పత్రాలు ఒరిజనల్ అని రాసిస్తారా.. టిప్పర్లను ఇప్పుడే వదిలిపెడతానని అన్నారు. ఎస్‌ఐ నిరాకరించడంతో టిప్పర్లను స్టేషన్‌కు తరలించి కేసులు నమోదు చేయాలని సూచించారు. అనుమతి పత్రాలు ఇస్తున్న వ్యక్తి కూడా నకిలీ అని అతడిపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అప్పజెప్పిన టిప్పర్లపై కేసు నమోదు చేయకుంటే సోమవారం పెద్దఎత్తున ఆందోళనకు దిగుతానని హెచ్చరించారు. జనవరి 2 నుంచి పెన్నానది నుంచి ఇసుక తరలించే టిప్పర్లు, ట్రాక్టర్లను అడ్డుకుంటామని, వాటి టైర్లకు గాలి తీస్తామని తెలిపారు.

చరిత్రను తెలుసుకోవాలి: రఘువీరా

నొళంబవాడి పుస్తకావిష్కరణ



పుస్తకావిష్కరణ సభలో మాట్లాడుతున్న రఘువీరారెడ్డి

హిందూపురం, డిసెంబరు 31: చరిత్రను తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని మాజీ మంత్రి రఘువీరారెడ్డి పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలోని వాల్మీకి భవన్‌లో గణిత ఉపాధ్యాయుడు సిద్దగిరి కోలెమొళ్ల శ్రీనివాస్ రచించిన నొళంబవాడి పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ.. ఓ గణిత ఉపాధ్యాయుడు చరిత్రను పుస్తకరూపంలో తీసుకురావడం హర్షించదగ్గ విషయమన్నారు. హేమావతి చరిత్ర రాజవంశానికి సంబంధించిన చరిత్రను క్లుప్తంగా తెలుగులో అందరికీ అర్థమయ్యేలా రచించడం గొప్ప విషయమన్నారు. హేమావతి చరిత్రను మరింత విస్తరించేందుకు ఈ పుస్తకం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కవులు, రచయితలు, వక్తలు మాట్లాడుతూ.. ఈ ప్రాంత చరిత్రను వెలుగులోకి తీసుకురావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబికా లక్ష్మీనారాయణ, మడకశిర మాజీ ఎమ్మెల్యే సుధాకర్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు కేటీ శ్రీధర్, ఎంఈఓ గంగప్ప, ఎంపీడీఓ నరేంద్ర, రచయిత చిదంబర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, సురేష్, అంకె శ్రీనివాస్, నారాయణస్వామి, రైతు సంఘం నాయకులు వెంకటరామిరెడ్డి, సదాశివరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, డిసెంబరు 31: జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు జిల్లా నుంచి పలువురు ఎంపికయ్యారు. జిల్లా అథ్లెటిక్స్ అడ్‌హక్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక నీలం సంజీవరెడ్డి మైదానంలో ఎంపిక పోటీలు నిర్వహించారు. అండర్-14, అండర్-16 బాలబాలికల విభాగంలో జట్లను ఎంపిక చేశారు. వీరు ఫిబ్రవరి 16వతేదీ నుంచి గుజరాత్‌లో జరిగే జాతీయ స్థాయి అంతర్ జిల్లా జూనియర్ అథ్లెటిక్స్ పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారని జిల్లా అథ్లెటిక్ అడ్‌హక్ కమిటీ కన్వీనర్ ఇస్మాయిల్, కోకన్వీనర్లు రవికుమార్, సుదర్శన్ తెలిపారు.



పరుగు పందెంలో పోటీపడుతున్న బాలికలు

సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి పూజలు



ఆత్మకూరు, డిసెంబరు 31: మండలంలోని పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర ఆలయంలో ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్వామివారికి పంచామృతాలతో అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేక అలంకరణ, ఆకుపూజ, అర్చన, మహానైవేద్యం, మంగళహారతి ఇచ్చారు. అనంతరం హోమం నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖరరెడ్డి, కార్యనిర్వహణాధికారి తదితరులు పాల్గొన్నారు.

పోస్టుల భర్తీకి ఆన్‌లైన్ పరీక్ష

అనంతపురం అర్బన్, డిసెంబరు 31: జిల్లాలోని 473 పశుసంవర్ధక సహాయకుడి (ఏహెచ్‌ఏ) పోస్టుల భర్తీ కోసం ఆదివారం ఆన్‌లైన్ పరీక్ష నిర్వహించారు. జిల్లాకేంద్రం సమీపంలోని ఎస్ఆర్ఐటీ, అనంతలక్ష్మి ఇంజనీరింగ్, ఎస్వీఐటీ, పీవీకేకే, శ్రీబాలాజీ పీజీ, తాడిపత్రిలోని సర్ సీవీ రామన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ, తాడిపత్రి ఇంజనీరింగ్ కళాశాల పరీక్ష కేంద్రాల్లో ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరిగింది. పరీక్షలకు 926 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా.. 919 మంది హాజరైనట్లు పశుసంవర్ధక శాఖ జేడీ సుబ్రహ్మణ్యం తెలిపారు.

అర్ధరాత్రి వరకు మద్యం విక్రయాలకు అనుమతి

అనంతపురం అర్బన్, డిసెంబరు 31: నూతన సంవత్సర ఆరంభం నేపథ్యంలో మద్యం దుకాణాల్లో విక్రయాలకు ప్రభుత్వం సమయం పెంచింది. ఆది, సోమవారం రెండు రోజుల్లో మద్యం దుకాణాల్లో రాత్రి 12 గంటల వరకు, బార్ అండ్ రెస్టారెంట్లల్లో అర్ధరాత్రి 1 గంట దాకా మద్యం విక్రయాలు జరిపేందుకు అనుమతులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ అయినట్లు అనంతపురం ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్, ఐఎంఎల్ డిపో మేనేజర్ రామమోహన్‌రెడ్డి తెలిపారు.

5న జడ్పీ సర్వసభ్య సమావేశం

అనంతపురం విద్య, డిసెంబరు 31: జడ్పీ సర్వసభ్య సమావేశం జనవరి 5వ తేదీ నిర్వహించనున్నట్లు సీఈఓ కేతన్‌గార్గ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ జనరల్ బాడీ మీటింగ్ డిసెంబరు 26వ తేదీ నిర్వహించాల్సి ఉండగా 'ఆడుదాం-ఆంధ్రా' వల్ల వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. 5వ తేదీ ఉదయం 10.30 గంటలకు సమావేశం నిర్వహించనున్నట్లు స్పష్టం చేశారు. సభ్యులంతా సమావేశానికి హాజరుకావాలని కోరారు.

పుట్టపర్తిలో చోరీ



పరిశీలిస్తున్న పోలీసులు

పుట్టపర్తిరూరల్, డిసెంబరు 31: జిల్లాకేంద్రంలోని ప్రధాన రహదారిలోని మనీఎక్స్ఛేంజ్ కార్యాలయంలో దుండగులు చొరబడి రూ.1.80 లక్షల నగదు అపహరించారు. సాయి ఫారెక్స్‌లో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగినట్లు బాధితుడు.. పోలీసులకు ఫిర్యాదుచేశాడు. దుండగులు షట్టర్‌కు ఉన్న తాళాలు తొలగించి ఫోరెక్స్‌లో ఉన్న నగదును అపహరించుకెళ్లినట్లు అందులో పేర్కొన్నాడు. అర్బన్ సీఐ కొండారెడ్డి ఆధ్వర్యంలో క్లూస్‌టీం.. వేలిముద్రలు సేకరించింది. ఇటీవల కాలంలో దోపిడీలు, చోరీలు అధికమవుతున్నా.. వాటిని అరికట్టడంతో పోలీసులు విఫలమవుతున్నారన్న విమర్శలు పట్టణవాసుల నుంచి వ్యక్తమవుతున్నాయి.

రైతు సమస్యలు పట్టని ప్రభుత్వం

ఆత్మకూరు డిసెంబరు 31: ఆ డుదాం ఆంధ్రా కార్యక్రమంపై ఉన్న శ్రద్ధ రైతులు సమస్యలు తీర్చడంలో లేదని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి మల్లికార్జున విమర్శించారు. స్థానిక భగత్ సింగ్ కాలనీలో ఆదివారం పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కరువు పరిస్థితులతో రైతులు అష్టకష్టాలు పడుతున్నారని, వా రిని ఆదుకోవడంలో ప్రభుత్వ నిర్ల క్ష్యం తగదన్నారు. పోతులయ్య, రామక్రిష్ణ, శ్రీకాంత్, శివ, నరేష్, వెంకటనారాయణ, చలపతి, రామాంజనేయులు, గోవిందు, ఈశ్వరయ్య పాల్గొన్నారు.



సీపీఐ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన కార్యదర్శి రామక్రిష్ణ తదితరులు

ఆటపాటలతో నిరసన



ఆటపాట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

చెన్నేకొత్తపల్లి, డిసెంబరు 31: అంగన్‌వాడీల సమ్మె 20వ రోజు ఆదివారంకొనసాగింది. చెన్నేకొత్తపల్లిలోని దీక్షా శిబిరం వద్ద ఆట-పాట కార్యక్రమాన్ని నిర్వహిస్తూ తమ నిరసనను వ్యక్తం చేశారు.

ఆర్‌ఈఎఫ్ కార్యవర్గం ఎన్నిక

అనంతపురం సెంట్రల్, డిసెంబరు 31: రిజర్వేషన్ ఎంప్లాయీస్ ఫెడరేషన్(ఆర్‌ఈఎఫ్) జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎంపికచేసినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణం తెలిపారు. ఆదివారం లిటిల్‌ఫ్లవర్ స్కూల్లో నిర్వహించిన సమావేశంలో జిల్లా అధ్యక్షుడిగా మూడోసారి రాజావత్ నాయక్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. 19మందికి కార్యవర్గంలో చోటుకల్పించామన్నారు.

నేడు శిల్పారామంలో సాంస్కృతిక కార్యక్రమాలు

అనంతపురంరూరల్, డిసెంబరు 31: మండలంలోని శిల్పారామంలో నూతన సంవత్సరాన్ని పురస్కరించుకుని సోమవారం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శిల్పారామం ఏఓ క్రిష్ణ ప్రసాద్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాయంత్ర 5గంటల నుంచి అమృత నృత్య కళానిలయం ఆధ్వర్యంలో కార్యక్రమాలు ఉంటాయన్నారు.

గ్రామాలకు అయోధ్య అక్షింతలు

శింగనమల, డిసెంబరు 31: మండల కేంద్రంలో ఆదివారం సాయంత్రం అయోధ్య అక్షింతలను రా మభక్తులు గ్రామాలకు తరలించారు. అయోధ్య నుంచి వచ్చిన అక్షింతలను శింగనమల ఆత్మారామస్వామి దేవాలయం నుంచి అన్ని గ్రామాలకు తరలించారు. సోమవారం నుంచి అక్షింతలు ప్రతి ఇంటికి చేరుస్తామని భక్తులు తెలిపారు.

అయ్యప్ప పూజకు హాజరైన మాజీ మంత్రి



ఇడుముడి, ప్రత్యేక పూజలకు హాజరైన పరిటాల సునీత

ఆత్మకూరు డిసెంబరు 31: మండలంలోని బీ యా లేరు గ్రామంలో ఆదివారం నాగ నందీశ్వర ఆలయంలో నిర్వహించిన అయ్యప్ప భక్తుల ఇరుముడి పూజలకు మాజీ మంత్రి పరిటాల సునీత హాజరయ్యారు. స్వామి వారికి పూజలు చేశారు. మండల ఇన్‌చార్జి బాలాజీ, జిల్లా నాయకులు మదిగుబ్బ మల్లికార్జున రెడ్డి, మండల కన్వీనర్ శ్రీనివాసులు, భాస్కర్‌నాయక్, నాగేంద్ర పాల్గొన్నారు.

కార్యవర్గం ఎంపిక

అనంతపురం విద్య, డిసెంబరు 31 : ఆంధ్రప్రదేశ్ ఎంపీఓ-1 అసోసియేషన్ అనంతపురం కొత్త జిల్లా కార్యవర్గం ఎంపిక చేసినట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సింహాచలం, ప్రధానకార్యదర్శి రవీ నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధ్యక్షులుగా గుంతకల్లు ఎంఈఓ మస్తాన్‌రావు, ప్రధాన కార్యదర్శిగా బ్రహ్మసముద్రం ఎంఈఓ ఓబుళపతి, కోశాధికారిగా పుటూ రు ఎంపీఓ శ్రీదేవి, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఆత్మకూరు ఎంఈఓ నరసింహారెడ్డి, రాష్ట్ర ప్రతినిధులుగా యాడికి ఎం ఈఓ కాశప్ప, పెద్దవడుగూరు ఎంఈఓ రాముడును ఎంపిక చేశామన్నారు.

'రాయలసీమ సింహగర్జన'ను జయప్రదం చేయండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, డిసెంబరు 31: భారత చైతన్య యువజన పార్టీ నిర్వహించబోయే రాయలసీమ సింహగర్జనను జయప్రదం చేయాలని ఆ పార్టీ నాయకులు పిలుపునిచ్చారు. ఎన్జీఓ హోంలో సింహగర్జనకు సంబంధించిన పోస్టర్లను వారు ఆదివారం విడుదల చేశారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పాల రమేష్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజలకు అనేక హామీలు ఇచ్చి గద్దెనెక్కిన జగన్మోహన్‌రెడ్డి వాటిని మరిచి రాష్ట్రాన్ని అప్పుల్లో ముంచారని మండిపడ్డారు. జనవరి 10న రుద్రంపేట బైపాస్‌లోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించే రాయలసీమ సింహగర్జనకు ప్రతిఒక్కరూ హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు బీసీ సురేష్ యాదవ్, డోన్ బాలు, రామ్మోహన్ మాదవ్, వరుణ్, వెంకటేశులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా సాంస్కృతిక సంబరాలు

అనంతపురం కల్చరల్, డిసెంబరు 31: కూచిపూడి కళాకేంద్రం ఆధ్వర్యంలో నూతన సంవత్సరాన్ని స్వాగిస్తూ ఆదివారం రాత్రి స్థానిక సాయికృష్ణ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన సాంస్కృతిక సంబరాలు ఉత్సాహభరితంగా సాగాయి. కార్యక్రమానికి ప్రభ సత్య వైద్యశాల డాక్టర్ హేమలత, నాట్యాచార్యులు కృష్ణమూర్తిరాజు, ఆనందరాజు ముఖ్యఅతిథులుగా హాజరై జ్యోతిప్రజ్వలన చేసి సంబరాలను ప్రారంభించారు. తొలుత చిన్నారులు భగవద్గీతలోని శ్లోకాలను ఆలపించగా అనంతరం మరికొందరు చిన్నారులు శాస్త్రీయ సంగీతానికి సంప్రదాయ నృత్యాలతో ఆహూతులను మంత్రముగ్ధులను చేశారు. అనంతరం చిన్నారులకు జ్ఞాపికలు అందజేసి సత్కరించారు.



చిన్నారికి జ్ఞాపిక, ప్రశంసాపత్రం బహూకరిస్తున్న దృశ్యం

ఉన్నతోద్యోగులుగా చేయడమే లక్ష్యం

అనంతపురం విద్య, డిసెంబరు 31: పేద విద్యార్థులు సైతం ఉన్నతోద్యోగులను చేయాలనే సదుద్దేశంతో వాల్మీకి విద్యార్థులకు ఉచితంగా గ్రూప్-2 స్టడీ మెటీరియల్ అందించినట్లు ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు అక్కులప్ప పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని పొట్టిశ్రీరాములు స్కూల్‌లో 150 మందికి గ్రూప్-2 మోడల్ టెస్ట్ నిర్వహించి ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులు ఉచితంగా మెటీరియల్ పంపిణీ చేశారు. అమరావతి హాస్పిటల్ ఎండీ ముత్యాలన్న, రిటైర్డ్ సీఈఓ ఈశ్వరయ్య, ఎస్‌బీసీ డెవలప్‌మెంట్ ఆఫీసర్ నాగభూషణం, తిమ్మయ్య, నరసింహమూర్తి, చైతన్యకుమార్, కోశాధికారి పవన్‌కుమార్, సహాధ్యక్షులు శ్రీనివాసులు, సంజీవ, భాగ్యరాజ్, ఓబులేసు, కుమారస్వామి, శంకర్ నారాయణ, నారాయణస్వామి, రామాంజనేలు, చిదంబరయ్య, దాదులూరయ్య పాల్గొన్నారు.


మెటీరియల్ అందుకున్న వాల్మీకి విద్యార్థులు

చట్టాల అమలుతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ

అనంతపురంరూరల్, డిసెంబరు 31: రాజ్యాంగం ప్రకారం చట్టాలు సక్రమంగా అమలు జరిగినప్పుడే ప్రజాస్వామ్య పరిరక్షణ సాధ్యమని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు టీవీ రెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక ప్రభుత్వ నెహ్రూ ప్రాథమిక పాఠశాలలో ఐక్యవేదిక సమావేశం నిర్వహించారు. అనంతపురంరూరల్, నగర కమిటీలను ఎంపిక చేశారు. ప్రధాన కార్యదర్శి అల్తాఫ్, కోశాధికారి సాంబశివుడు, జిల్లా నాయకులు సుబ్బరాయుడు, సదాశివ, నగర కమిటీ నాయకులు షేక్ నబిరసూల్, షేక్ నిజాం, రామకృష్ణ, మంజునాథ్, బసవరాజు, సూర్యప్రకాష్, లక్ష్మీశ్యామ్, రూరల్ కమిటీ నాయకులు ఫణిభూషణ్, బాబాఫకృద్దీన్ వలి, రియాజుద్దీన్, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

అనంతపురం క్రైం, డిసెంబరు 31: నగర శివారులో జూదం ఆడుతున్న వారిని టూటౌన్ పోలీసులు దాడులు నిర్వహించి అరెస్టు చేశారు. ఆదివారం టూటౌన్ సీఐ శివరాముడు సిబ్బందితో కలిసి దాడులు చేశారు. నాయక్‌నగర్ శివారులో జూదం ఆడుతున్న ఐదుగురిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.33190 స్వాధీనం చేసుకున్నారు.

పశువుల సంత ఆదాయం రూ.3.89 లక్షలు

అనంతపురంరూరల్, డిసెంబరు 31: అనంతపురం వ్యవసాయ మార్కెట్‌లో జరిగిన పశువుల సంతతో మార్కెట్‌కు రూ.3,89,760 ఆదాయం వచ్చినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి జయలక్ష్మి ఆదివారం తెలిపారు. శనివారం జరిగిన గొర్రెలు, మేకల సంత ద్వారా మార్కెట్‌కు రూ.2,24,360, ఆదివారం జరిగిన ఎనుములు, ఎద్దులు, ఆవుల సంతతో రూ.1,65,400 వచ్చిందని తెలిపారు.

అవినీతి పాలనకు కాలం చెల్లింది..


నెలగొండలో కరపత్రాన్ని ఇస్తున్న జితేంద్రగౌడు

గుంతకల్లు, డిసెంబరు 31: అవినీతిమయమైపోయిన జగన్ పాలనకు కాలం చెల్లిపోయిందని మాజీ శాసనసభ్యుడు జితేంద్రగౌడు పేర్కొన్నారు. మండలంలోని నెలగొండ గ్రామంలో ఆదివారం సాయంత్రం భవిష్యత్తు గ్యారెంటీ పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలపై కరపత్రాలను అందజేసి ప్రచారం చేశారు. కార్యక్రమంలో ప్రతాప్ నాయుడు, టీ కేశప్ప, సిమెంటు నారాయణ, జగన్నాథ్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతానికి యువకుడి బలి


వన్నూరుస్వామి మృతదేహం

విడపనకల్లు, డిసెంబరు 31: బోరుబావి మోటారును మరమ్మతు చేస్తూ ప్రమాద వశాత్తు విద్యుదాఘాతంతో ఓ యువకుడు ఆదివారం మధ్యాహ్నం మృతి చెందాడు. బంధువులు, విడపనకల్లు పోలీసులు తెలిపిన మేరకు విడపనకల్లు గ్రామానికి చెందిన తాతప్ప గారి వన్నూరుస్వామి (26), అదే గ్రామానికి చెందిన దుల్లా వద్ద ట్రాక్టర్‌తో బోరుబావుల మరమ్మతు పనులు చేసేవాడు. ఆదివారం మధ్యాహ్నం మండలంలోని పెద్ద కొట్టాలపల్లి గ్రామానికి చెందిన బాబు పొలంలో బోరును మరమ్మతు చేసేందుకు వెళ్లాడు. మోటారును బయటికి తీసి మరమ్మతు చేసి చెక్ చేయాలని విద్యుత్ కనెక్షన్ ఇచ్చాడు. అయితే మోటారును పట్టుకోవడంతో షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి వివాహం జరిగి రెండు సంవత్సరాలు అయ్యింది. ఇతనికి ఆరునెలల బాబు ఉన్నాడు.

దోబీ ఘాట్ నుంచి అక్రమ కనెక్షన్

పెద్ద కొట్టాలపల్లికి చెందిన వైసీపీ నాయకుడు బాబు పొలానికి విద్యుత్ కనెక్షన్ లేక పోయినా దగ్గర్లో ఉన్న దోబీ ఘాట్ నుంచి అక్రమంగా కనెక్షన్ తీసుకుని వినియోగిస్తున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. బాబు పొలానికి అనుకుని ఎక్కడా విద్యుత్ లైన్లు లేవని విద్యుత్ సరఫరాకు దరఖాస్తు చేసుకుంటే వెంటనే మంజూరు చేస్తామన్నారు. ఈ విషయమై విడపనకల్లు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నూతన సంవత్సర వేడుకలకు చర్చిల ముస్తాబు

యల్లనూరు, డిసెంబరు31: నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని మండలంలోని పలు చర్చిలను విద్యుత్ దీపాలతో ముస్తాబు చేశారు. రాత్రి 12గంటలకు ప్రత్యేక ప్రార్థనలు చేస్తామని పాస్టర్లు తెలిపారు.

తప్పిపోయిన బాలికలు తల్లిదండ్రులకు అప్పగింత

గుత్తి, డిసెంబరు 31: పట్టణంలోని చెంబుల బావి వీధికి చెందిన ఇద్దరు తప్పిపోయిన బాలికలను ఆదివారం తల్లిదండ్రులకు అప్పగించినట్లు సీఐ వెంకటరామి రెడ్డి తెలిపారు. చెంబుల బావికి చెందిన అనిత, గొల్ల క్రిష్ణవేణి అనే ఇద్దరు బాలికలు రెండు రోజుల క్రితం స్కూల్‌కి వెళ్తున్నామని చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి గాలింపు చర్యలు ముమ్మరం చేశామన్నారు. తిరుపతిలో ఆచూకీని కనుక్కొని బాలికలను తీసుకువచ్చి తల్లిదండ్రులకు అప్పగించినట్లు సీఐ తెలిపారు.

మాస్కులు, శానిటైజర్ల పంపిణీ

తాడిపత్రిటౌన్, డిసెంబరు31: కరోనా కేసుల నేపథ్యంలో స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి, జన సమూహ ప్రాంతాల్లో ఆదివారం కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ సూర్యనారాయణరెడ్డి మాస్కులు, శానిటైజర్లను పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించి కరోనాను తరిమికొట్టాలని ఆయన సూచించారు.

రైలు నుంచి జారిపడి యువకుడి మృతి


శివకుమార్‌గౌడ్ (ఫైల్)

తాడిపత్రిటౌన్, డిసెంబరు31: మండలంలోని చల్లవారిపల్లి గ్రామసమీపంలో ఆదివారం రైలు నుంచి ప్రమాదవశాత్తు జారిపడి శివకుమార్‌గౌడ్ (21) మృతిచెందాడని రైల్వే ఎస్ఐ నాగప్ప తెలిపారు. పట్టణంలోని నందలపాడుకు చెందిన నాగరాజుగౌడ్, ఓబులమ్మ దంపతుల కుమారుడు శివకుమార్‌గౌడ్ ఐచర్ డ్రైవర్‌గా పనిచేస్తుండేవాడు. రెండురోజుల క్రితం వ్యక్తిగత పనినిమిత్తం కొండాపురం వెళ్లిన శివకుమార్‌గౌడ్ ఆదివారం రైలులో తిరుగుప్రయాణం అయ్యాడు. చల్లవారిపల్లి గ్రామసమీపంలోకి రాగానే ప్రమాదవశాత్తు రైలులో నుంచి జారిపడి అక్కడికక్కడే మృతిచెందాడు. ఒక్కగానొక్క కుమారుడు మృతిచెందడంతో తల్లిదండ్రులు శోకసంద్రంలో మునిగిపోయారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

ఉరవకొండ,డిసెంబరు31: పట్టణంలోని మల్లేశ్వర దేవాలయంలో ఆదివారం జంగమ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన నూతన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. సంఘం అధ్యక్షులు బండయ్య, కార్యదర్శి బసవరాజు 2024 నూతన క్యాలెండర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో సంఘం నాయకులు రాచెప్ప, రుషీంద్ర, విజయ్ కుమార్, నటరాజ్, విరుపాక్షి, ధనుంజయ, మల్లికార్జున పాల్గొన్నారు.

కురుబలకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలి

కణేకల్లు, డిసెంబరు 31: తమ కులస్థులకు టీడీపీలో రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని కురుబ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్‌కే మల్లికార్జున కోరారు. అనంతపురం జిల్లా ఎంపీ స్థానాన్ని తమ కులస్థుడైన జిల్లా కురుబ సంఘం అధ్యక్షుడు రాజహంస శ్రీనివాసులుకు కేటాయించాలని తమ సంఘంలోని మెజార్టీ ప్రజలు కోరుకుంటున్నారన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు ఈ విషయంలో తమకు తగు న్యాయం చేయాలని ఆయన కోరారు.

మున్సిపల్ కార్మికుల మానవహారం



తాడిపత్రిలో అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న మున్సిపల్ కార్మికులు

గుంతకల్లుటౌన్/ గుత్తి/ తాడిపత్రిటౌన్/ రాయదుర్గం, డిసెంబరు 31: తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ స్థానిక పొట్టిశ్రీరాములు సర్కిల్‌లో మున్సిపల్ కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులు ఆదివారం మానవహారంగా ఏర్పడి నిరసన తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ పారిశుధ్యం, ఇంజనీరింగ్ కార్మికులు, సీఐటీయూ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె ఆదివారం ఆరో రోజు కొనసాగింది. గుత్తి, తాడిపత్రి, రాయదుర్గంలో కార్మికులు అర్ధనగ్నంగా నిరసన చేశారు.

ఈకేవైసీతో వినియోగదారుల ఇబ్బందులు

యాడికి, డిసెంబరు31: గ్యాస్ కనెక్షన్ ఈ-కేవైసీ కోసం వినియోగదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. యాడికిలోని ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ కార్యాలయం వద్దకు ఆదివారం వినియోగదారులు పెద్దఎత్తున తరలివచ్చారు. గ్యాస్ కనెక్షన్‌కు ఈ-కేవైసీ చేయించుకోకపోతే సబ్సిడీ, ఇతర సంక్షేమ పథకాలకు అర్హులు కారని సోషల్‌మీడియాలో వైరల్ అయింది. దీంతో మండలంలోని వివిధ గ్రామాల నుంచి గ్యాస్ వినియోగదారులు పెద్దఎత్తున తరలివచ్చారు. వినియోగదారుల మధ్య తోపులాట జరిగింది. గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులను వివరణ కోరగా ప్రభుత్వ నిబంధనల మేరకే ఈ-కేవైసీ చేస్తున్నామని తెలిపారు. ఈ-కేవైసీ చేయించడానికి ప్రభుత్వం గడువు ఇచ్చినంత వరకు చేస్తామని తెలిపారు.

అయ్యప్పస్వామి మాలధారులకు భిక్ష

గుంతకల్లుటౌన్,డిసెంబరు31: పట్టణంలోని డీఆర్ఎం కార్యాలయం వద్ద ఉన్న అయ్యప్ప స్వామి ఆలయంలో అయ్యప్పస్వామి మాలధారులకు పట్టణంలోని ధనలక్ష్మి ప్రొవిజనల్ స్టోర్ యజమాని రూపినేని హరిప్రసాద్ ఆదివారం భిక్షను ఏర్పాటు చేశారు.

వృద్ధురాలికి ఆర్థిక సాయం

తాడిపత్రిటౌన్, డిసెంబరు31: పట్టణంలోని పాతకోటలో నివాసం ఉంటున్న వృద్ధురాలికి జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కదిరి శ్రీకాంత్‌రెడ్డి ఆదివారం రూ.10వేలు ఆర్థికసాయం చేశారు. అనారోగ్య సమస్యలతో వృద్ధురాలి కాలు తీసివేశారు. విషయం తెలుసుకున్న శ్రీకాంత్‌రెడ్డి వృద్ధురాలి ఇంటికి వెళ్లి పరామర్శించి ఆర్థికసాయం అం దించారు. అనంతరం నందలపాడుకు చెందిన పలువురు యువకులు జనసేన పార్టీలో చేరారు. ఆయన వెంట పలువురు కార్యకర్తలు ఉన్నారు.

ఘనంగా కనకదాసు జయంతి వేడుకలు



కనకదాసు చిత్రపటానికి ప్రత్యేక పూజలు చేస్తున్న కురుబలు

కుందుర్పి, డిసెంబరు 31: మండలంలోని యర్రగుంట గ్రామంలో ఆదివారం కనకదాసు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. కురుబ కులస్తులు ఉదయం నుంచి కనకదాసు చిత్రపటానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం కనకదాసు చిత్రపటంతో గ్రామ పురవీధుల గుండా మేళతాళాలు, యువకుల నృత్యాల నడుమ ఊరేగింపు నిర్వహించారు.

యూటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

గుంతకల్లుటౌన్, డిసెంబరు31: పట్టణంలోని సరోజినీనాయుడు పురపాలక బాలికోన్నత పాఠశాలలో ఆదివారం యూటీఎఫ్ ఆధ్వర్యంలో 2024 సంవత్సరం క్యాలెండర్, డైరీని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓ 1,2లు మస్తాన్‌రావు, సుబ్బరాయుడు హాజరయ్యారు. వీరి చేతుల మీదుగా క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యూటీఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మోడల్ పేపర్ ద్వారా ఎంతో ఉపయోగకరమైన మెటీరియల్ అందిస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కోశాధికారి రాఘవేంద్ర, పట్టణ శాఖ ప్రధాన కార్యదర్శులు రామకృష్ణ, రాజ్‌కుమార్, గౌరవ అధ్యక్షుడు మల్లికార్జున, ఉపాధ్యక్షుడు రమేష్, కోశాధికారి ఎల్లన్న, జిల్లా కౌన్సిలర్లు శంకరయ్య, సిద్దయ్య, నాయకులు అబ్దుల్‌రఫీ, సుధాకర్, పెన్నయ్య, వెంకటేష్, తిమ్మారెడ్డి, గురునాథ్, తదితరులు పాల్గొన్నారు.

మతి స్థిమితం లేని యువకుడి అప్పగింత

గుంతకల్లు, డిసెంబరు31: మతి స్థిమితంలేని ఓ యువకుడు ఇంటి నుంచి వెళ్లిపోయి గుంతకల్లు రావడంతో జీఆర్పీ పోలీసులు గుర్తించి అతడి బంధువులకు అప్పగించారు. అస్సోంకు చెందిన నెర్స్వన్ బారో అనే వ్యక్తి మతి స్థిమితం లేని కారణంగా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. రైలెక్కి ఇక్కడకు వచ్చాడు. గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో రెండు రోజుల కిందట దిగాడు. అతడి పరిస్థితిని గమనించిన జీఆర్పీ పోలీసులు అతడి నుంచి వివరాలను రాబట్టి అతడి అన్నకు సమాచారాన్ని అందజేశారు. వారు ఆదివారం గుంతకల్లుకు రాగా అప్పగించారు.

పబ్లిక్ ప్రదేశాలలో వేడుకలకు అనుమతుల్లేవు: సీఐ

గుంతకల్లుటౌన్, డిసెంబరు 31: పట్టణంలోని రహదారులు, పబ్లిక్ ప్రదేశాలలో నూతన సంవత్సరం వేడుకలు జరుపుకోవడానికి అనుమతులేవని టూటౌన్ సీఐ గణేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మద్యం మత్తులో వాహనాలు నడపరాదని, అధిక వేగంతో బైక్, కారు, ఇతర వాహనాలు నడిపి ప్రాణాలకు ముప్పు తెచ్చుకోవద్దన్నారు. రోడ్లపై యువత మద్యం సేవిస్తూ, వీధుల్లో తిరుగుతూ, బైక్‌లపై తిరుగుతూ ప్రజలకు ఇబ్బంది కలిగించరాదని సూచించారు. రోడ్లపై గుంపులు, గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేసే విధంగా ప్రవర్తించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. స్నేహ పూర్వక వాతావరణంలో, సన్నిహితులతో, కుటుంబ సభ్యులతో నూతన సంవత్సవరం వేడులకను జరుపుకోవాలని సీఐ సూచించారు.

రామలింగేశ్వరస్వామి సేవలో ఎమ్మెల్యే

ఉరవకొండ,డిసెంబరు31: వజ్రకరూరు మండలం జరుట్ల రాంపురంలోని రామలింగేశ్వరస్వామిని ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ ఆదివారం దర్శించుకున్నారు. ఎమ్మెల్యే పేరిట అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో నూతేటి వెంకటేశులు, నాగేంద్ర, నాగభూషణం, ఎర్రిస్వామి, పాల్గొన్నారు.

5 నుంచి పింఛన్ల పంపిణీ

పుట్లూరు, డిసెంబరు31: మండలంలో ఈనెల 5నుంచి పింఛన్ల పంపిణీ ఉంటుందని ఎంపీడీఓ యోగానందరెడ్డి ఆదివారం తెలిపారు. పెంచిన పింఛన్ల డబ్బులను ఇంటివద్దకు వచ్చి వలంటీర్లు ఇస్తారని తెలిపారు. వృద్ధులు, పింఛన్‌దారులు సహకరించాలని ఆయన కోరారు.

ప్రకృతితో మమేకమై జీవిద్దాం

కుందుర్పి, డిసెంబరు 31: విలువల బడుల్లోని విద్యార్థులంతా ప్రకృతిని అర్థం చేసుకుని, దానితో మమేకమై జీవించాలని ఎస్‌కే చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకులు లెనిన్‌బాబు అన్నారు. మండలంలోని విలువల బడులలో ప్రకృతి నడక కార్యక్రమాన్ని ఆదివారం ప్రారంభించారు. ఇకపై విలువలబడులలోని విద్యార్థులందరు వారాంతపు సెలవులలో ప్రకృతి నడకకు వెళుతూ ప్రకృతితో మమేకమై అక్కడే యోగా, ధ్యానం, ఆటపాటలతో పాటు మొక్కలు నాటుతారన్నారు. ఈ సందర్భంగా ప్రకృతి నడక మాకెంతో ఆనందాన్ని ఇచ్చిందని విద్యార్థులు తెలిపారు. వారాంతపు సెలవులలో తప్పకుండా ప్రకృతి నడక కార్యక్రమాన్ని కొనసాగిస్తామని విద్యార్థులు అన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల విలువలబడి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా చిత్రదేవర గ్రామోత్సవం

కుందుర్పి, డిసెంబరు 31 : మండలంలోని నిజవల్లి గ్రామంలో వెలసిన చిత్రదేవర ఈరణ్ణ స్వాముల గ్రామోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం అక్కడ నుంచి నిజవల్లి నుంచి బెస్తరపల్లి గ్రామంలో వెలసిన బొమ్మదేవర ఆలయం వరకు ఊరేగింపుతో వెళ్లి గంగపూజ, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బెస్తరపల్లిలో ప్రత్యేకపూజల అనంతరం తిరిగి నిజవల్లి గ్రామానికి చేరుకోనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.